


ఇంటర్వెల్‌లో లైట్లు వెలిగాయి. గోవింద రావుకు బైటకు వెళ్ళాలనిపించలేదు. సీట్లోనుంచి ఒకసారి లేచి మళ్ళీకూర్చున్నాడు. వెనుకనుంచి 'గోవిందరావుగారూ' అని పిలుపు వినిపించింది. తనను కాదులెమ్మనుకొన్నాడు. మళ్ళీ 'గోవింద రావుగారూ' అని పిలుపు రావటంతో వెనుకకు తిరిగి చూశాడు. ఎవరో ఒకామె దాదాపు ముప్పై సంవత్సరాల వయస్సుండవచ్చు 'మీపేరు గోవింద రావుగారు కదూ' అని అడిగింది.

'అవును' ఆమెను ఎప్పుడో ఎక్కడో చూసి నట్లు గుర్తు.

"నేను జ్ఞాపకం వున్నానా?"

గోవిందరావు జ్ఞాపకం చేసుకోవటానికి ప్రయ త్నించాడు.

"మాది చింతపల్లి - నేను రాఘవాచార్లు గారి కూతురు పుష్పవల్లిని - దాదాపు పదిహేను పద హారు సంవత్సరాల క్రితం మీరు మా ఊళ్ళో ఉద్యోగం చేశారు. మా ఇంటికి ఎదురుగావున్న వేదాంతం వారింట్లో మీరు అద్దెకుండేవారు."

గోవిందరావు తృప్తిపడ్డాడు. "నువ్వా? మీ రిప్పుడీ వూళ్ళో వుంటున్నారా? నీకు పిల్లలెంత మంది?"

ఆమె ఫలానా అని తెలియగానే గోవిందరావుకు ఆశ్చర్యము, ఆనందము కల్గినయ్. గొంతుక కొంచెం వణికింది.

తిరిగి సినిమా ఆరంభం కావటంతో ఎవరి సీట్లో వాళ్ళు కూర్చున్నారు. గోవిందరావు మనోఫలకం మీద మరోసినిమా ఆరంభమైంది.

* * *

గోవిందరావుకు క్రొత్తగా ఉద్యోగమొచ్చింది. చింతపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో అతనిని ఉపాధ్యాయుడుగా వేశారు. అప్పటికి అతని వివాహమై సంవత్సరమన్నా కాలేదు. భార్య పార్వతి కాపురానికొచ్చి రెండు నెలలయిందేమో. అంతా కోడలొచ్చిన వేళా విశేషమన్నారు. కొత్త దంపతులు చింతపల్లిలో కాపురం పెట్టారు. గోవిందరావు వాళ్ళు వుండే ఇంటి కెదురుగాన రాఘవాచార్లుగారి ఇల్లుండేది. ఆయన వృత్తి ఆ ఊరి జనార్ధనస్వామివారి కోవెలలో నైవేద్యం పెట్టటం. ఆ దేవుడి తాలూకు పాతిక ఎకరాల భూమిని కౌళ్ళకు ఇచ్చుకొని దానిపైవచ్చే అయి వేజా అనుభవించటం. ఆయనకు మగ సంతానం లేదు. ఉన్నది ఒకేఒక ఆడపిల్ల పుష్పవల్లి. పది హేను పదహారేళ్ళ వయసులో ఎర్రగా బొద్దుగా మిసమిసలాడుతూ వుండేది. అప్పుడప్పుడు గోవిందరావు వాళ్ళ ఇంటికివచ్చి 'మామయ్య గారూ - అత్తయ్యగారూ' అంటూ కబుర్లు చెప్పేది. గోవిందరావు దగ్గర వాళ్ళ మామగారిచ్చిన గ్రాంఫోన్ వుండేది. పుష్పవల్లి గ్రాంఫోన్ పాటలు వినటానికి తరుచు వస్తుండేదిగూడా. ఆ పిల్లను చూసినప్పుడల్లా గోవిందరావుకు ఏదో చాపల్యం కలిగేది. ఇంట్లో భార్య వుండటం మూలాని పైకి వెలిబుచ్చేవాడు కాదు. అప్పుడప్పుడు ఆ భావాలు ఏదో రూపంలో పైకివచ్చేవి. భార్యతో ఏకాంతంగా వున్నప్పుడు "ఇవ్వాళ ఆచార్లగారమ్మాయి వేసు కున్న జాకెట్టు బాగుందిగదూ. నీకు అటువంటి దయితే బాగుంటుందా?" అని అడిగేవాడు. అవు ననో కాదనో ఆమె సమాధానం చెప్పేది.

"ఆ పుష్పవల్లి మరీఅంత వెకిలిగా నవ్వుతుందే మిటి. మగవాణ్ని నేనున్నానని అయినా సిగ్గు లేకుండా పమిటి ఇష్టమొచ్చినట్టు జారవిడుస్తుంది. ఛీ" అనేవాడు. పార్వతికి ఆ సమయంలో ఏమి అనిపించేది గాదు. తర్వాత ఎప్పుడయినా ఆ మాటలు గుర్తొకొచ్చినపుడు "ఈ మనిషి ఇటువంటివిగూడా గమనిస్తూ వుంటారా ఏం?" అనుకొనేది.

దసరా పండుగ వచ్చింది. పదిరోజులు ముందు గానే కూతురిని అల్లుడిని తీసుకపోదామని గోవింద రావు మామగారు వచ్చారు దాచేపల్లి నుంచి. దసరా పండుగ వచ్చిందంటే పిల్లలకు ఉపాధ్యాయులకు గూడా బోలెడంత సరదా. పిల్లలు కొత్త బట్టలు తొడుక్కొని కోలాటాలు వేసుకుంటూ ఊళ్ళో తిరగొచ్చు. అయ్యవార్లకు అయిదువరహాలు కాక పోయినా కనీసం అయిదు రూపాయలైనా ప్రతి ఇంటినుంచి కట్నంరూపంలో ముడుతుంది. ఆ పండుగ ఎప్పుడు వస్తుందా అని కనిపెట్టుకొని వుంటారు పిల్లలు - అయ్యవార్లుగూడా.

గోవిందరావు తనువెళ్ళకుండా భార్యను పంపిం చారు మామగారితో. వీలుగావుంటే తాను పండుగ నాటికి వస్తానని చెప్పాడు.

ఒకరోజు బియ్యంకడిగి కుంపటిమీద పడేసి గ్రాంఫోన్ ముందుపెట్టుకొని కూర్చున్నాడు గోవిందరావు.

"నీ పేరువిన్నా - నీ రూపుగన్నా ఉయ్యాల లూగు మది నై నై నై." ఈ పాటంటే గోవింద రావుకు ప్రాణం. ఎప్పుడు కాసేపు సమయం దొరి కినా ఈ రికార్డు పెట్టుకొని కూర్చుంటాడు.

"మామయ్యగారూ ఈ కూర మీకిచ్చిరమ్మన్నది మా అమ్మ" అంటూ చేతిలో ఓ ప్లేటు పట్టుకొని వచ్చింది పుష్పవల్లి. 'అయ్యయ్యో అన్నం మాడి పోతుంటే, ఎంతబాగ పాటలువింటూ కూర్చు న్నారేం" అంటూ గబగబావెళ్ళి కుంపట్లోనించి అన్నంగిన్నె దింపేసింది.

"ఏమో. ఇవన్నీ ఆడవాళ్ళు చేయవలసిన పనులు. మాచేత నేమౌతుంది గనక" అన్నాడు గోవిందరావు గ్రాంఫోన్ మూసేస్తూ. అతనిలో ఎప్పటినుండో దాక్కొనివున్న విషపుకోరిక బుసలు

